సాక్షి నిజామాబాద్

ఆదివారం । 15 । జూన్ । 2025



భూ భారతిని సమర్థవంతంగా..

భూ భారతి జిల్లాలో సమర్థవంతంగా అమలయ్యేలా కృషి చేయాలని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు.

- 8లో ▸



ప్రైవేటు బస్సుల నిలువు..

నిజామాబాద్, జగిత్యాల జిల్లాల నుంచి ముంబైకి వెళుతున్న ప్రయాణికులు నిలువు దోపిడీకి గురవుతున్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.7 /25.0

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన సీపీ



ఖలీల్‌వాడి : జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డిని సీపీ సాయిచైతన్య శనివారం కలెక్టరేట్ సముదాయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించగా.. సీపీ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

జిల్లా రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం



నిజామాబాద్‌నాగారం : రాష్ట్రంలో ఎనిమిది రక్తనిధి కేంద్రాలు పని చేస్తుండగా, వాటిలో నిజామాబాద్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బ్లడ్‌బ్యాంకు సేవలు, తలసేమియా వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న ఉచిత సేవలు అభినందనీయమని రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం రాజ్‌భవన్‌లోని సంస్కృతి భవన్‌లో గవర్నర్ అవార్డులను అందజేశారు. రక్తదాన శిబిరాలు, తలసేమియా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నందుకు జిల్లా రెడ్‌క్రాస్‌కు మూడోసారి ఐఎస్‌వో సర్టిఫికెట్ దక్కింది. అలాగే 67సార్లు రక్తదానం చేసిన గాదేవార్ గంగాధర్‌కు గవర్నర్ అవార్డును అందజేశారు. గవర్నర్ ప్రధాన కార్యదర్శి, ఇన్‌చార్జి చైర్మన్ దాన కిశోర్, సంయుక్త కార్యదర్శి భవానీశంకర్, నిజామాబాద్ జిల్లా చైర్మన్ బుసా ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్, జిల్లా కోశాధికారి కలిపె రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.40 లక్షలతో పరారీ

ఖలీల్‌వాడి: నగరంలోని ఎల్లమ్మగుట్ట ప్రాంతంలోని ఓ ప్రయివేటు సెక్యూరిటీ ఏజెన్సీలో పనిచేసే ఉద్యోగి ఏటీఎంలో డిపాజిట్ చేసే నగదు తీసుకొని పారిపోయినట్లు నాల్గో టౌన్ ఎస్సై శ్రీకాంత్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లమ్మగుట్ట వద్ద ఉన్న ప్రయివేటు ఏజెన్సీ ద్వారా ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకులకు చెందిన ఏటీఎంలలో డబ్బులను డిపాజిట్ చేస్తారు. శనివారం ఉదయం విధులకు వచ్చిన న్యాల్‌కల్ రోడ్‌కు చెందిన రమాకాంత్ రూ.40 లక్షల 50 వేలు ఏజెన్సీ వద్ద ఉన్న వాహనంలో పెడుతుండగా ఎత్తుకొని పరారైనట్లు చెప్పారు. రమాకాంత్ ఎత్తుకెళ్లిన డబ్బులను బోధన్‌లోని ఓ బ్యాంక్ ఏటీఎంలో డిపాజిట్ చేయాల్సి ఉన్నట్లు సమాచారం. బ్యాంక్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తింపు లేని ప్రైవేట్ కళాశాలల్లో చేరొద్దు

నిజామాబాద్ అర్బన్ : నిజామాబాద్ నగరంతో పాటు జిల్లాలో ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు అఫ్లియేషన్ గుర్తింపు ఉందా లేదా అని స్పష్టంగా తెలుసుకొని మాత్రమే విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి శ్రీ తిరుమలపుడి రవి కుమార్ స్పష్టం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు అడ్మిషన్ల విషయంలో మోసపోకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అఫ్లియేషన్ లేని జూనియర్ కళాశాలల్లో చేరిన తర్వాత ఇంటర్మీడియట్ బోర్డుకు ఎలాంటి సంబంధం ఉండదని స్పష్టం చేశారు.

నీట్‌లో జిల్లా విద్యార్థులకు ర్యాంకులు



రాథోడ్ కార్తిక్, రాథోడ్ స్నేహ, జె. అన్విక

నిజామాబాద్ అర్బన్: వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్ యూజీ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఫలితాల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు జాతీయ ర్యాంకులు సాధించారు. నగరంలో ఎస్ఆర్ జూనియర్ కళాశాలకు చెందిన రాథోడ్ కార్తిక్ 1623, జే అన్విక 1970, రాథోడ్ స్నేహ 3646 ర్యాంకులు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

త్యాగశీలి తండ్రి



సండే స్పెషల్

- నడక.. నడవడిక నేర్పేది నాన్న
- కుటుంబం కోసం ఎన్నో త్యాగాలు చేస్తూ..
- పిల్లల ఉన్నతి కోసం పరితపించే వ్యక్తి
- కుటుంబ రక్షకుడు.. మార్గదర్శకుడు

నేడు ఫాదర్స్ డే

కుటుంబం కోసం తన ఇష్టాలను.. ఓ దశలో తన లక్ష్యాలను త్యాగం చేసే మహోన్నత వ్యక్తి తండ్రి. పిల్లలకు నడకతో పాటు నడవడికను నేర్పి సమాజంలో ఉన్నతస్థాయిలో నిలిపేందుకు ప్రతిక్షణం పరితపించే ఆయన.. కుటుంబ రక్షకుడు, మార్గదర్శకుడు. పిల్లలపై తల్లిది ప్రేమ అయితే.. తండ్రిది భయంతో కూడిన బాధ్యత. పిల్లల బంగారు భవిష్యత్ కోసం పరితపిస్తూ.. వారు ఇష్టమైన రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తూ ఓ స్థాయికి చేరుస్తున్నాడు. స్నేహితునిగా, సోదరునిగా మసులుకుంటూ పిల్లలను ఉన్నత స్థాయికి చేర్చిన.. సమాజంలో గుర్తింపున్న వ్యక్తులుగా తీర్చిదిద్ది వారి సక్సెస్ వెలుగుల వెనుక ఉన్న 'నాన్న' కష్టం వెలకట్టలేనిది. ఫాదర్స్‌డే సందర్భంగా 'సాక్షి' స్పెషల్..

– మోర్తాడ్(బాల్కొండ)

ఒకరు ఎంబీఏ.. మరొకరు ఎంఎస్

బోధన్: బోధన్ మండలం ఏరాజ్‌పల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు అయిల దేవిదాస్‌గౌడ్ తన కూతుళ్లు ప్రత్యూష, ప్రణీతను ఉన్నత చదువులు చదివించారు. వృత్తి పనిలో అరకొర ఆదాయం ఉన్నా ఏనాడూ ఆ ప్రభావం పిల్లల చదువులపై పడకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. ఆయన ప్రోత్సాహంతో పెద్ద కూతురు ప్రత్యూష బోధన్‌లోని ఎస్‌పీ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (బీజెడ్‌సీ), ఎంబీఏ కోర్సు పూర్తి చేసి ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. రెండో కూతురు ప్రణీత బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఎంసీఏ కోర్సులు పూర్తి చేసింది. అమెరికాలో ఎంఎస్ పూర్తి చేసింది. నాన్న ప్రోత్సాహంతోనే ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా ముందుకు వెళ్లామని ఆ అక్కాచెల్లెళ్లు అంటున్నారు.



తండ్రి దేవిదాస్‌గౌడ్‌తో కూతుళ్లు ప్రత్యూష, ప్రణీత

కష్టార్జితమంతా కూతుళ్ల చదువుకే..

బోధన్: మహారాష్ట్ర సరిహద్దుల్లోని ఖండ్‌గాం గ్రామానికి చెందిన కాంబ్లే జనార్దన్ తన కూతుళ్లను ఉన్నత చదువులు చదివించాలనే కలతో బోధన్‌కు వచ్చి స్థిరపడ్డాడు. పెయింటింగ్ పని చేస్తూ కష్టాలకు ఎదురీదుతూ తాను అనుకున్నట్లుగానే కూతుళ్లు చందన, స్పందనను ఉన్నత చదువులు చదివించాడు. పెద్ద కూతురు చందన బోధన్‌లోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ, ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్సీ (జువాలజీ) పూర్తి చేసింది. బ్యాక్‌లాగ్ గ్రూప్–4 ఉద్యోగ అర్హత పరీక్షలో ప్రతిభ చాటి వైద్యారోగ్యశాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించింది. 2020లో కామారెడ్డి జిల్లా వైద్యారోగ్య శాఖలో చేరగా, రెండేళ్ల తరువాత పదోన్నతి లభించింది. చందన ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తోంది. తన చెల్లి స్పందన బీటెక్ పూర్తి చేసి ప్రస్తుతం ఓ ప్రముఖ కంపెనీలో మైసూర్‌లో ఉద్యోగం చేస్తోందని, మా నాన్న కష్టార్జితమే తమ చదువు, ఉద్యోగాలని స్పందన తెలిపింది.



కూతుళ్లు చందన, స్పందనతో కాంబ్లే జనార్దన్

సెక్యూరిటీ గార్డు కొడుకు కాబోయే డాక్టర్



కొడుకుతో దర్శనాల గంగాధర్

నవీపేట: మెడికల్ కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న మండల కేంద్రంలోని లింగంగుట్టకు చెందిన దర్శనాల గంగాధర్ తన కొడుకును ఎంబీబీఎస్ చదివిస్తున్నాడు. ప్రతి రోజూ తన కళ్ల ముందు కనిపించే వైద్యవిద్యార్థులను చూస్తూ కొడుకును సైతం డాక్టర్‌ని చేయాలని కలలుగన్నాడు. సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తే వచ్చే జీతం సరిపోకపోవడంతో ఉదయం వేళలో భార్య అన్నపూర్ణతో కలిసి ఉపాధి హామీ పనులకు వెళ్తున్నాడు. వారికి ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కుమారుడు సిద్ధార్థ ప్రస్తుతం కరీంనగర్‌లోని ప్రతిమ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్నాడు.

దేశ సేవలో కూతురు..



భోజారెడ్డి



గీతారాణి (భోజారెడ్డి కూతురు)

మోర్తాడ్(బాల్కొండ): ఆర్మీలో చేరి దేశ సేవ చేయాలని ఆశించినప్పటికీ సాధ్యం కాలేదని, కానీ తన కూతురు ఆర్మీలో చేరి దేశ సేవ చేస్తోందని గర్వంగా చెబుతున్నాడు గాండ్లపేట్ గ్రామానికి చెందిన నిమ్మల భోజారెడ్డి. పోలీసుశాఖలో కానిస్టేబుల్‌గా పని చేసిన ఆయన కుటుంబ సమస్యల కారణంగా ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి ఆర్టీసీలో డ్రైవర్‌గా చేరాడు. దేశానికి సేవ చేయాలనే తన తండ్రి కల నెరవేరకపోవడంతో.. తాను దానిని నిజం చేయాలని ఆయన కూతురు గీతారాణి సంకల్పించింది. శ్రీపద్మావతి యూనివర్సిటీలో ఎమ్మెస్సీ నర్సింగ్‌పూర్తి చేసింది. అమెరికా, యూరప్ దేశాల్లో ఎన్నో కంపెనీలు భారీ వేతన ప్యాకేజీ ఆఫర్ చేసినప్పటికీ తన తండ్రి కలను నెరవేర్చేందుకు ఆర్మీలోని నర్సింగ్ విభాగంలో చేరింది.

150 మంది పిల్లలకు డాడీ



మానవతసదన్ పిల్లలతో కేర్ టేకర్ అందె రమేష్

- అనాథ పిల్లలను ఆదర్శవంతులుగా తీర్చిదిద్దుతూ..
- తండ్రి పాత్ర పోషిస్తున్న మానవతసదన్ కేర్ టేకర్ రమేష్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం తరఫున అనాథ బాల, బాలికల కోసం డిచ్‌పల్లి మండల కేంద్రంలో 17 ఫిబ్రవరి 2016లో 'మానవతసదన్' ను ప్రారంభించారు. అప్పటి జిల్లా కలెక్టర్ యోగితారాణా ప్రత్యేక శ్రద్ధతో మానవతసదన్ ఏర్పాటుకు కృషి చేశారు. 14 మంది పిల్లలతో ప్రారంభమైన సదన్‌లో ప్రస్తుతం 150 మంది పిల్లలు (బాలురు 48, బాలికలు 102 మంది) ఉన్నారు. మానవతసదన్‌కు చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారు. లైజనింగ్ ఆఫీసర్‌గా పి.సుధాకర్‌రావు, కేర్‌టేకర్‌గా ఉపాధ్యాయుడు అందె రమేశ్ విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రమేశ్ 24 గంటలూ పిల్లల బాగోగులను పర్యవేక్షిస్తుంటారు. అనాథ పిల్లలను తన సొంత బిడ్డలుగా భావించి వారిని ఆదర్శవంతులుగా, ఉన్నత స్థాయికి చేర్చాలనే లక్ష్యంతో పని చేస్తున్నాడు. కొందరు పిల్లలు ప్రస్తుతం బీఎస్సీ నర్సింగ్, బీటెక్, హార్టికల్చర్ కోర్సులు చదువుతున్నారు. వారికి ఆయా కళాశాలల్లో ఫీజులు చెల్లించడానికి దాతలు సహకరిస్తున్నారు. దాతలు దొరకని సమయంలో వారి కళాశాల, హాస్టల్ ఫీజులు కేర్‌టేకర్ రమేశ్ చెల్లిస్తూ వారి ఉన్నత చదువులకు అండగా ఉంటూ తండ్రి లేని లోటును తీరుస్తున్నారు. మావనతసదన్‌లోని పిల్లలందరూ రమేష్‌ను 'డాడీ' అని ప్రేమగా పిలుస్తారు. ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న ఆయన సతీమణి సహకారం కూడా ఎంతో ఉంది.

నా బిడ్డలుగా భావిస్తా



పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తే పాఠాలు బోధించే వరకే బాధ్యత ఉంటుంది. మానవతసదన్‌లో పని చేస్తే ఇక్కడ ఉండే అనాథ పిల్లలను నా సొంత బిడ్డలుగా భావించి తండ్రి పాత్ర పోషించే అవకాశం లభిస్తుంది. ప్రభుత్వ సహకారంతో పిల్లలను వారి ఆశయాలకు అనుగుణంగా ఉన్నత చదువులు చదివించేందుకు వీలుకలుగుతుంది.

– అందె రమేశ్, మానవతసదన్ కేర్‌టేకర్

కట్టుబాట్లను కాదని కూతుళ్లకు వేద బాట



నలుగురు కూతుళ్లతో కాశీరాం జోషి (హన్మాండ్లు పంతులు)

మోర్తాడ్ (బాల్కొండ): మారుతున్న నాగరికతకు అనుగుణంగా సమాజంలో మార్పు తీసుకువచ్చే శక్తి ఆడవారికి ఉందని అందరికీ తెలిసేలా చేశారు చౌట్‌పల్లికి చెందిన కాశీరాం జోషి(హన్మాండ్ల పంతులు). వేద పఠనం, ఉపనిషత్తులు నేర్చుకోవడం, పౌరోహిత్యం మగవారికే పరిమితం అని గట్టిగా వాదించిన వారు ముక్కున వేలువేసుకునేలా చేశారు. తన పౌరోహిత్య వారసత్వాన్ని అందుకునే కొడుకులు లేరని బాధపడకుండా తన నలుగురు కూతుళ్లు ప్రణవేశ్వరి, రాజేశ్వరి, భువనేశ్వరి, జ్ఞానేశ్వరికి చిన్నతనం నుంచే వేదాలు, ఉపనిషత్తులు నేర్పించారు. ఆడవారికి ఉపనయం ఏమిటని అప్పట్లో ఎంతో మంది ప్రశ్నించినా ఎవరినీ లెక్క చేయకుండా సికింద్రాబాద్‌లోని ఆర్య సమాజ్ నిర్వాహకుడు పండిత్ నరేంద్రజీని చౌట్‌పల్లికి ఆహ్వానించి ఆయనతో

1972లో తన కూతుళ్లకు ఉపనయనం చేయించారు. ఆ రోజు కాశీరాం జోషి ఒక తండ్రిగా తన కూతుళ్లకు చూపిన వేద బాటను ఇప్పుడు ఎంతో మంది ఆచరిస్తున్నారు. 2022లో కాశీరాంజోషి శివైక్యం అయ్యారు. తమ తండ్రి చూపిన బాటను వృత్తిగా కాకుండా ధర్మంగా భావిస్తున్నామని ఆ నలుగురు అక్కాచెల్లెళ్లు అంటున్నారు.

రాజీ పద్ధతిలో సత్వర న్యాయ పరిష్కారానికి అవకాశం

- జిల్లా జడ్జి, న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్ భరత లక్ష్మి
- జాతీయ లోక్ అదాలత్‌లో 29,725 కేసుల పరిష్కారం
- రూ. 18 కోట్ల 36 లక్షలకు పైగా పరిహారం అందజేత



జెన్‌కో ఉద్యోగి కుటుంబానికి రూ. 90 లక్షల చెక్కు అందజేస్తున్న జిల్లా జడ్జి

నిజామాబాద్ లీగల్ : దీర్ఘకాలిక న్యాయ వివాదాల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ చక్కని పరిష్కార మార్గమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ జీవీఎస్ భరతలక్ష్మి అన్నారు. శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిళ్ళ సాయి రెడ్డి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఉదయ భాస్కర్ రావు, అదనపు జిల్లా పోలీసు కమిషనర్ బస్వారెడ్డితో కలిసి ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ కోర్టుల్లో కేసులతో కక్షిదారులు విలువైన జీవితకాలాన్ని కోల్పోతారని, లోక్ అదాలత్‌ల ద్వార రాజీ పద్ధతిలో కేసులను పరిష్కరించుకుంటే సత్వర న్యాయానికి అవకాశముందని ఆమె అన్నారు. లోక్ అదాలత్‌లలో కేసులను పరిష్కరించుకోవాలని కక్షిదారులను బలవంతం చేయరాదని, ఇష్టపూర్వకంగా రాజీకి మాత్రమే ప్రయత్నించాలని జడ్జి కోరారు. అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజ అభివృద్ధికి వినియోగించాలని, వినాశానికి కాదని అన్నారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిరెడ్డి మాట్లాడుతూ లోక్ అదాలత్‌కు బార్ అసోసియేషన్ అండగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో జడ్జి హరీష, సీనియర్ సివిల్ జడ్జి సాయిసుధ, జూనియర్ సివిల్ జడ్జీలు గోపికృష్ణ, ఖుష్బు ఉపాధ్యాయి, శ్రీనివాస్ రావు, హరి కుమార్ తదితరులు పాల్గొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ కోర్టుల్లో ఏర్పాటు చేసిన 18 బెంచ్‌ల ద్వార సివిల్, క్రిమినల్, బీమా కేసులకు సంబంధించి 29,725 కేసులను పరిష్కరించారు. కక్షిదారులకు 18 కోట్ల 36 లక్షల 61 వేల 156 రూపాయల పరిహారం అందజేసినట్టు జిల్లా న్యాయసేవాధికార సంస్థ సూపరింటెండెంట్ శైలజ తెలిపారు. ఈ సందర్భంగా చోళ మండలం ఇన్సూరెన్స్ కంపెనీ ద్వార జెన్‌కో ఉద్యోగి ప్రేమ్‌దాస్ కుటుంబానికి రూ. 90 లక్షల పరిహారం చెల్లించారు.



జాతీయ లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్ భరతలక్ష్మి

జిల్లాలో పనిచేయడం గొప్ప అనుభూతి

- ఉద్యోగులు, అధికారుల సహకారం వల్లే ధాన్యం సేకరణ, ఇతర అంశాలలో జిల్లా ముందంజ
- శాసన సభ, పార్లమెంటు, ఎమ్మెల్సీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించగలిగాం
- వీడ్కోలు సమావేశంలో జిల్లా పూర్వ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



రాజీవ్ గాంధీ హనుమంతుకు జ్ఞాపికను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అధికారులు

నిజామాబాద్ అర్బన్ : నిజామాబాద్ జిల్లాలో విధులు నిర్వహించడం ఎంతో గొప్ప అనుభూతిని కలిగించిందని బదిలీ అయిన జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. నూతన జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన టి వినయ్ కృష్ణారెడ్డికి ఇదే వేదికపై స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ కలెక్టర్‌గా తాను జిల్లాలో బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి కింది స్థాయి ఉద్యోగి మొదలుకుని ప్రతి శాఖకు చెందిన అధికారులందరూ అన్ని విషయాల్లోనూ ఎంతగానో సహకరించారని అన్నారు. వారి తోడ్పాటు కారణంగానే జిల్లాను ధాన్యం సేకరణ వంటి అనేక అంశాలలో ముందంజలో నిలుపగలిగామని, వరుసగా వచ్చిన శాసన సభ, పార్లమెంటు, ఎమ్మెల్సీ ఎన్నికల ను ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సమర్థవంతంగా నిర్వహించడంలో సఫలీకృతం కాగలిగామని అన్నారు. ముఖ్యంగా వ్యవసాయాధారిత ప్రాంతమైన జిల్లాలో పని చేయడం వల్ల ధాన్యం సేకరణ, పసుపు, ఎర్రజొన్న వంటి అంశాలతో పాటు, సాగు రంగంపై మంచి అనుభవం ఏర్పడిందని, మునుముందు నిర్వర్తించే విధులకు ఇది ఎంతగానో ఉపకరిస్తుందని అన్నారు. జిల్లా ప్రజలు ఎంతో మంచివారని, అన్ని వర్గాల వారు అందించిన సహకారంతోనే జిల్లాను ప్రగతి దిశలో ముందంజలో నిలుపగలిగామన్నారు. జిల్లా పాలనాధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డితో తనకు మంచి సాన్నిహిత్యం ఉందని తెలిపారు. జిల్లాకు సమర్థవంతమైన అధికారి కలెక్టర్‌గా వచ్చారని, ఆయన నేతృత్వంలో జిల్లా మరింతగా ప్రగతి దిశగా పయనిస్తుందనే పూర్తి నమ్మకం ఉందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను గుర్తిస్తూ అధికారులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని, తనకు తోడ్పాటును అందించిన రీతిలోనే నూతన కలెక్టర్ కు కూడా పూర్తి స్థాయిలో సహాయ, సహకారాలు అందించాలని కోరారు.

పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్డీవోలు రాజేంద్ర కుమార్, రాజాగౌడ్ తదితరులు బదిలీపై వెళ్తున్న రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి పని చేసిన అనుభవాలను నెమరువేసుకున్నారు.

వీడ్కోలు సమావేశంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులతో పాటు గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ్ రెడ్డి, టీఎన్జీవోల సంఘం అధ్యక్షుడు సుమన్, పీఆర్టీయూ సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధి వి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కలిసి పనిచేద్దాం : కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ బదిలీపై వెళ్తున్న రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లా కలెక్టర్ గా తనదైన ప్రత్యేకతను చాటారని, ఆయన ఒరవడిలోనే ముందుకు సాగుతూ జిల్లాను అన్ని రంగాలలో ముందంజలో నిలిపేలా కృషి చేస్తానని అన్నారు. తాను ఉద్యోగులతో స్నేహపూర్వకంగా మెలుగుతానని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల లక్ష్య సాధనకు సమష్టిగా కృషి చేద్దామన్నారు.

క్లుప్తంగా

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఆర్ఎస్ఈటీఐ) ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి ఏసీ రిపేరింగ్ (30 రోజులు), సెల్ ఫోన్ రిపేరింగ్ (30 రోజులు) శిక్షణ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో చేరేందుకు పురుషుల నుంచి మాత్రమే దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలంలో నేర్చుకోవడానికి కావాల్సిన టూల్స్, యూనిఫామ్, శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ధ్రువీకరణ పత్రం అందజేస్తామన్నారు. ఉచిత శిక్షణతోపాటు భోజన సదుపాయం, హాస్టల్ వసతి కల్పిస్తామని తెలిపారు. 19 నుంచి 40 సంవత్సరాల వయసు గల నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువకులు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డు, 10వ తరగతి ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 08461– 295428 నంబర్‌లో సంప్రదించాలని డైరెక్టర్ రవికుమార్ పేర్కొన్నారు.

ఇన్‌చార్జి మంత్రిని కలిసిన పీసీసీ అధికార ప్రతినిధి



కమ్మర్‌పల్లి: జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క)ను టీపీసీసీ అధికార ప్రతినిధి, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పరిశీలకుడు బాస వేణుగోపాల్ యాదవ్ కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరినట్లు వేణుగోపాల్‌యాదవ్ తెలిపారు.

సాలూరలో కమ్యూనిటీ కాంటాక్ట్



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బోధన్‌రూరల్: సాలూర మండల కేంద్రంలో బోధన్ రూరల్ పోలీసులు శనివారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని సాయినగర్ కాలనీలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్ నేతృత్వంలో సమావేశం నిర్వహించి గ్రామస్తులకు శాంతి భద్రతలు, చట్టాలు, పోలీసుల విధులపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం అభినందనీయం

- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ రూరల్: మానవత్వంతో ఆలోచించి రక్తదానం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు ముందుకు రావడం అభినందనీయమని నిజామాబాద్ రూరల్ శాసనసభ్యుడు డాక్టర్ భూపతి రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని కంఠేశ్వర్ బైపాస్‌లో ఉన్న రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడం ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిండు ప్రాణాలను రక్షించడంలాంటిదేనని అన్నారు. శిబిరం నిర్వహించిన రూరల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తుంపల్లి మహేందర్, ఉమ్మజి నరేశ్‌లను అభినందించారు. కార్యక్రమంలో రూరల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఆకాశ్ రెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ వినోద్, బైండ్ల ప్రశాంత్, వంశీ, వెంకటేశ్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సుల నిలువు దోపిడీ

- ముంబైకి వెళ్లే ప్రయాణికుల జేబులకు చిల్లు
- ట్రావెల్ బస్సుల్లో అడ్డగోలు చార్జీలు
- ఆర్టీసీ బస్సు ఒకటే నడవడంతో ఇబ్బందులు



మోర్తాడ్(బాల్కొండ): నిజామాబాద్, జగిత్యాల జిల్లాల నుంచి ముంబైకి వెళుతున్న ప్రయాణికులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ముంబైకి టీజీఎస్ ఆర్టీసీ ఒకటే బస్సు నడపడంతోపాటు ప్రయాణికుల సంఖ్యకు సరిపడా రైళ్లు లేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైవేటు బస్సులను ఆశ్రయిస్తున్నారు. వేసవి సెలవులు ముగియడం, విద్యా సంస్థలు పున: ప్రారంభం కావడంతో ముంబై నుంచి తెలంగాణ జిల్లాలకు వచ్చిన వారు తిరుగు పయనమవుతున్నారు. దీంతో ప్రైవేటు బస్సుల ఆపరేటర్లు టికెట్ ధరలను అమాంతం పెంచడంతో తమ జేబులకు చిల్లులు పడుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.

ఆర్టీసీ సీట్లు ఫుల్..

వేములవాడ డిపో నుంచి లహరి బస్సు ఒక్కటే ముంబైకి ప్రయాణికులను చేరవేస్తుంది. ఈ బస్సులో స్లీపింగ్ బెర్త్‌కు రూ.1,700లు, సీటు కోసం రూ.1,300ల చార్జీ వసూలు చేస్తున్నారు. ఒకే బస్సు ఉండటంతో రెండు, మూడు రోజుల టిక్కెట్లు ముందుగానే బుకింగ్ అయిపోతున్నాయి. కాగా, నిజామాబాద్ నుంచి దేవగిరి ఎక్స్‌ప్రెస్(రైలు) ఒక్కటే ముంబైకి ప్రతి రోజూ వెళుతుంది. దీంతో ఆ రైలు కాస్తా ప్రయాణికులకు కిక్కిరిసిపోతుంది.

ఒక్క టికెట్ రూ.2,500

సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఇదే అదనుగా భావిస్తున్న టావెల్స్ ఆపరేటర్లు టికెట్ల ధరలను పెంచేశారు. గతంలో స్లీపింగ్ బస్సులో ఒక్కో టిక్కెట్‌కు రూ.1,200 ల నుంచి రూ.1,300 ల చార్జీ వసూలు చేసేవారు. ఇప్పుడు రూ.2,500 లకు టిక్కెట్ ధర పెంచారు. సీటులో కూర్చొని ప్రయాణించేవారికి రూ.900 ల చార్జీ ఉండగా రూ.1,700 లకు పెంచారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఆర్మూర్, నిజామాబాద్ బుకింగ్ పాయింట్‌ల నుంచి ముంబైకి ప్రయాణం సాగుతుంది.

ఎక్కడి నుంచి బస్సు ఎక్కినా ఒక్కటే చార్జీని వసూలు చేస్తున్నారు. నిత్యం ఆరు, ఏడు ప్రయివేటు బస్సులు రెండు జిల్లాల నుంచి ముంబైకి ప్రయాణికులను తరలిస్తున్నాయి. కాగా, ముంబై నుంచి వచ్చే వారికి కూడా ఇదే విధమైన చార్జీలను వసూలు చేస్తున్నారని ప్రయాణికులు తెలిపారు. ప్రైవేటు బస్సుల చార్జీల నియంత్రణకు చర్యలు తీసుకునేవారు లేకపోవడంతో ఆపరేటర్లు చెప్పినంత ధరకు టికెట్లను కొనుగోలు చేయాల్సి వస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఇద్దరికి రూ.5 వేలు

ముంబైకి అత్యవసరంగా వెళ్లాల్సి ఉంది. చార్జీలు పెరిగినా తప్పనిసరి పరిస్థితుల్లో టికెట్‌లను కొనుగోలు చేసి బయల్దేరాం. నేను, నా భార్య ఇద్దరికే స్లీపర్ సీట్లకు రూ.5 వేలు ఖర్చు చేశాం. ఆర్‌టీసీ సంస్థ బస్సులను నడిపితే ప్రయాణికులకు ప్రయోజనంతోపాటు ప్రైవేటు బస్సుల్లో చార్జీలు నియంత్రణలోకి వచ్చేవి.

– రాజన్న, తొర్తి(ముంబై)

నెట్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం



నూతన కార్యవర్గసభ్యులతో ఎన్నికల ప్రతినిధులు

నిజామాబాద్ నాగారం: నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని వినాయక్‌నగర్ అభ్యాస స్కూల్‌లో నిర్వహించిన ఎన్నికలకు పరిశీలకులుగా కామారెడ్డి జనరల్ సెక్రెటరీ రఘురాం, నిజామాబాద్ యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ ముత్తెన్న, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, ఎన్నికల అధికారిగా నాగేశ్వరావు వ్యవహరించారు. నూతన కార్యవర్గం 2029 వరకు కొనసాగుతుందని ఎన్నికల అధికారి ప్రకటించారు. అధ్యక్షుడిగా జీ వెంకటేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శిగా ఏ రమేశ్, కోశాధికారిగా పీ గంగాధర్, చైర్మన్‌గా రవీందర్, వైస్ ప్రెసిడెంట్లుగా సీహెచ్ అన్నపూర్ణ, నాగేశ్, రమేశ్, జాయింట్ సెక్రెటరీలుగా నాగరాజు, కృష్ణంరాజు, ఆశాజ్యోతి, అనిల్‌కుమార్, ఈసీ మెంబర్లుగా కుమార్, ప్రవీణ్, రాజు, సాగర్, అప్పారావు, మధుకర్, ప్రసన్న ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం నెట్‌బాల్ పోటీల్లో క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చేలా ప్రోత్సహిస్తామన్నారు.

ప్రశ్నే ప్రగతికి మెట్టు

- చట్టాలపై అవగాహన అవసరం
- జన విజ్ఞాన వేదిక ప్రత్యేక తరగతుల్లో వక్తలు



మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు నర్రా రామారావు

నిజామాబాద్‌నాగారం: ప్రశ్నించడమే ప్రగతికి మెట్టని, రాజ్యాంగ చట్టాలపై అందరికీ అవగాహన అవసరమని వక్తలు పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు కోయేడి నర్సింహులు అధ్యక్షత వహించగా, రాష్ట్ర అధ్యక్షుడు నర్రా రామారావు హాజరై మాట్లాడారు. జనవిజ్ఞాన వేదిక 1988 ఫిబ్రవరి 28 జాతీయ సైన్స్ దినోత్సవం రోజు ఆవిర్భవించిందని తెలిపారు. ఆవిర్భావం కంటే ముందు సమాజ మార్పు కోరే ఉద్యోగస్తులు, ఇంజనీర్లు, డాక్టర్లు, శాస్త్రవేత్తలు కలిసి భారత జన విజ్ఞాన జాత ద్వారా గ్రామాన్ని తెలుసుకో గ్రామాన్ని మార్చుకో అనే అంశంపై కళాజాత నిర్వహించారని గుర్తు చేశారు. అనంతరం మన విశ్వం అనే అంశంపై సురేశ్ కావాల్లా ప్రసంగించారు. రాజ్యాంగ ఆవశ్యకత, హక్కులు, చట్టాలు తదితర అంశాలపై సాయన్న అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్, వెంకట మల్లయ్య, విజయ ఆనంద రావు, రామకృష్ణ, పెద్ది వెంకట్రాములు, జేవీవీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ కలెక్టర్‌కు వీడ్కోలు



పూర్వ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు జ్ఞాపిక అందజేస్తున్న కమిషనర్

నిజామాబాద్ సిటీ/అర్బన్: కలెక్టర్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న రాజీవ్‌గాంధీ హనుమంతుకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్ ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహించిన ఆయనను కమిషనర్ దిలీప్‌కుమార్ సన్మానించి జ్ఞాపికను అందజేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు. టీఎస్‌జీవోస్ అధ్యక్షుడు సుమన్ ఆధ్వర్యంలో నాయకులు బదిలీపై వెళ్తున్న కలెక్టర్ హనుమంతును సన్మానించారు.



రాజీవ్‌గాంధీ హనుమంతును సన్మానిస్తున్న టీఎన్‌జీవో నాయకులు

క్రైం కార్నర్

చెరువులో పడి మత్స్యకారుడి మృతి



లక్ష్మణ్ మృతదేహం

బీబీపేట: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన శనివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుర్రం లక్ష్మణ్ (35) శుక్రవారం స్థానిక పెద్ద చెరువులో చేపలవేటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం చెరువు వద్దకు వెళ్లి చూడగా లక్ష్మణ్ మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

కేజీవీల్ ట్రాక్టర్ ఢీకొని ఒకరు..

బోధన్‌రూరల్: మండలంలోని సంగం గ్రామంలో నాయకం ఎర్ర సాయిలు (48) కేజీవీల్ ట్రాక్టర్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం నాయకం ఎర్ర సాయిలు గ్రామంలోని చౌరస్తా వద్ద గల హోటల్‌లో టీ తాగి నడుచుకుంటూ వెళుతున్నాడు. అదే సమయంలో గ్రామానికి చెందిన సూర శ్రీనివాస్ కేజీవీల్ ట్రాక్టర్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ సాయిలును ఢీకొట్టాడు. దీంతో దమ్ము చక్రాల కింద పడిపోవడంతో సాయిలు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మచ్చేందర్ రెడ్డి పేర్కొన్నారు.

దేశీదారు పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ ఎస్సై సత్యనారాయణ

నిజాంసాగర్(జుక్కల్): మద్నూర్ మండలం రుశేగావ్ చౌరస్తా వద్ద శనివారం 10 దేశీదారు మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు బిచ్కుంద ఎక్సైజ్ ఎస్సై సత్యనారాయణ తెలిపారు. రుశేగావ్ నుంచి ద్విచక్ర వాహనంపై దేశీదారు మద్యం తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు చౌరస్తా వద్ద ద్విచక్ర వాహనదారుడుని పట్టుకొని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దేశీదారు తరలిస్తున్న బండి సురేశ్‌తోపాటు దిగంబర్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.


చోరీ కేసులో ఒకరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై మహేశ్

ఎల్లారెడ్డి: పట్టణంలోని సత్యం కిరాణా దుకాణంలో చోరీకి పాల్పడిన వ్యక్తిని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని భిక్కనూర్ గ్రామానికి చెందిన కోడేనోళ్ల రాజు ఈ నెల 11న రాత్రి సత్యంకు చెందిన కిరాణా దుకాణంలో చోరీకి పాల్పడ్డాడు. శనివారం ఎల్లారెడ్డిలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా పోలీసులను చూసి పారిపోతున్న రాజును పట్టుకొని విచారించగా కిరాణా దుకాణంలో చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లు

ఇందల్వాయి: మండలంలోని లోలం వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ శనివారం తెలిపారు. వాగు నుంచి కొందరు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు వెళ్లి చూడగా ట్రాక్టర్ డ్రైవర్ల వద్ద అనుమతి పత్రాలు లేవన్నారు. దీంతో కేసు నమోదు చేశామన్నారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

కంటైనర్, టీవీఎస్ ఎక్సెల్ ఢీ

- ఇద్దరికి గాయాలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలో జాతీయ రహదారిపై కంటైనర్, టీవీఎస్ ఎక్సెల్ ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... లింగంపేట మండలం శెట్పల్లి సంగారెడ్డికి చెందిన ఒడ్డె గాలయ్య, సిద్దవ్వ టీవీఎస్ ఎక్సెల్‌పై గోపాల్‌పేటలోని జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా మెదక్ నుంచి ఎల్లారెడ్డి వైపు వెళ్తున్న కంటైనర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాలయ్య, సిద్ధవ్వ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వేయి స్తంభాల ఆలయాన్ని పోలిన ఆలయం

మీకు తెలుసా?





దోమకొండ గడికోటలోని మహదేవుని ఆలయ నిర్మాణానికి అప్పట్లో వరంగల్ సంస్థానంను పరిపాలించిన రాణి రుద్రమదేవి వచ్చినట్లు శిలాఫలకం ఉంది. ప్రస్తుతం ఏదైనా కార్యక్రమాన్ని మంత్రులు, ఇతర ప్రముఖులు ప్రారంభించినప్పుడు ఏ విధంగానైతే శిలా ఫలకాలు ఏర్పాటు చేస్తున్నారో ఆ రోజుల్లో సైతం ఆమె ఆలయ నిర్మాణానికి వచ్చినప్పుడు శిలాఫలకం ఏర్పాటు చేసినట్లు పురావస్తుశాఖ ప్రతినిధులు గుర్తించారు. వరంగల్‌లోని వేయి స్తంభాల ఆలయాన్ని పోలిన విధంగా అదే శిల్పకళా నైపుణ్యంతో ఇక్కడి మహదేవుని ఆలయ నిర్మాణం ఉంటుంది.

–దోమకొండ

జీపీఎస్ ట్రాకర్‌తో వాహనం సేఫ్

- చోరీ చేస్తే సులభంగా గుర్తించే వీలు
- పరికరం బిగించుకునేందుకు ఆసక్తి చూపుతున్న వాహనదారులు



ఖలీల్‌వాడి: రూ. లక్షలు పెట్టి కొనుగోలు చేసిన వాహనం చోరీకి గురైతే ఎవరికైనా బాధగా ఉంటుంది. అదే వాహన కొనుగోలు సమయంలో కొంత ఖర్చుపెట్టి జీపీఎస్ ట్రాకర్‌ను బిగిస్తే వాహనానికి భద్రత ఉంటుంది. ఇటీవల బైక్‌లకు జీపీఎస్ ట్రాకర్‌లు బిగించుకునేందుకు యజమానులు ఆసక్తి చూపుతున్నారు. వాహన జీపీఎస్ ట్రాకర్ వాడకంతో హైదరాబాద్ వంటి ప్రధాన నగరంలో వాహనాల చోరీల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు తెలుస్తోంది.

జీపీఎస్ పని చేసేది ఇలా..

జీపీఎస్(గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) ట్రాకర్ శాటిలైట్ సిగ్నల్స్ ద్వారా అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా వాహనం కచ్చితమైన స్థానాన్ని గుర్తిస్తుంది. మొబైల్ యాప్, వెబ్ ప్లాట్‌ఫాం ద్వారా వినియోగదారుడికి సమాచారం చేరుతుంది. వాహనంలో బయటికి కనిపించని ప్రాంతాల్లో జీపీఎస్‌ను బిగించి బ్యాటరీకి అనుసంధానం చేస్తారు. మరికొన్ని స్వతంత్ర బ్యాటరీతో పనిచేస్తాయి. కంపెనీలు జీపీఎస్ ట్రాకర్‌లను అమర్చేందుకు రూ. 1500 నుంచి రూ. 5 వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఇందులో ఉండే సిమ్ కార్డును రీఛార్జి చేసుకోవాల్సి ఉంటుంది.

ఉపయోగాలివి..

రియల్ టైమ్ ట్రాకింగ్: జీపీఎస్ బిగించిన వాహనం చోరీకి గురైతే కచ్చితమైన స్థానాన్ని చూపిస్తుంది. పార్క్ చేసిన ప్రాంతం నుంచి కదిలిస్తే సెల్‌ఫోన్‌కు (మెసేజ్) హెచ్చరిక వెళుతుంది. మరికొన్ని ట్రాకర్లలో ఉన్న చోటి నుంచే వాహన ఇంజిన్‌ను ఆపేయవచ్చు.

రికవరీ వేగవంతం: బైక్‌ను ఎత్తుకెళ్లితే వారు ఎక్కడికి తీసుకువెళ్లారో స్పష్టంగా తెలియడంతోపాటు జీపీఎస్ సాయంతో పోలీసులు వాహనాన్ని త్వరగా గుర్తించి స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుంది.

స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి

వాహనాలు చోరీకి గురైతే వెంటనే స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేయాలి. వాహన తనిఖీల్లో దొరికే అవకాశం ఉంటుంది. వాహనంపై ఏ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయినదో స్పష్టంగా తెలుస్తుంది. వాహనాల తనిఖీల్లో జీపీఎస్‌తో ఉన్న బైక్ దొరికితే అసలు యజమానిని సులభంగా తెలుసుకోవచ్చు.

– ప్రసాద్, ట్రాఫిక్ సీఐ, నిజామాబాద్

భూభారతిని సమర్థవంతంగా అమలు చేయాలి



నార్త్ తహసీల్ కార్యాలయ తనిఖీ అనంతరం అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- ఆర్డీవో, తహసీల్ కార్యాలయాల తనిఖీ
- మోపాల్, నడిపల్లి రైతు వేదికలు పరిశీలన

నిజామాబాద్ అర్బన్: భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం జిల్లాలో సమర్థవంతంగా అమలయ్యేలా అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి రెవెన్యూ అధికారులకు సూచించారు. శనివారం ఆయన నిజామాబాద్ ఆర్డీవో, సౌత్, నార్త్ తహసీల్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూ భారతి రెవెన్యూ సదస్సుల సందర్భంగా వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారానికి చేపడుతున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులను వెంటదివెంట పరిశీలిస్తూ, నిర్ణీత గడువులోపు పరిష్కారమయ్యేలా చొరవ చూపాలన్నారు. తప్పిదాలకు ఆస్కారం లేకుండా, భూ భారతి చట్టంలోని నిబంధనలను తుచ తప్పకుండా పాటిస్తూ, పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. అందుబాటులో ఉన్న రెవెన్యూ రికార్డుల వివరాలతో సరిపోల్చుకుని, క్షేత్రస్థాయి విచారణను పకడ్బందీగా జరపాలని అన్నారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, సౌత్, నార్త్ తహసీల్దార్లు బాలరాజు, విజయ్‌కాంత్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

రైతు వేదికలను ముస్తాబు చేయాలి

ఈ నెల 16న నిర్వహించనున్న రైతు నేస్తం కార్యక్రమానికి జిల్లాలోని అన్ని రైతు వేదికలను అందంగా ముస్తాబు చేయాలని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. డిచ్‌పల్లి మండలం నడిపల్లి, మోపాల్ మండల కేంద్రంలోని రైతు వేదికలను సందర్శించి, అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. రైతు నేస్తం కార్యక్రమానికి ఆదర్శ రైతులతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. సీఎం వీసీ ద్వారా రైతులతో ముఖాముఖి జరుపనున్నందున ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి వీర స్వామి తదితరులు ఉన్నారు.

కడుపునొప్పి భరించలేక ఒకరి ఆత్మహత్య



అల్లూరి లింగారెడ్డి మృతదేహం

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని బాద్గుణ గ్రామానికి చెందిన అల్లూరి లింగారెడ్డి (57) కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. అల్లూరి లింగారెడ్డి కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కాగా, శుక్రవారం నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పంచగుడి గ్రామంలో ఉన్న తన చెల్లి వద్దకు వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరాడు. కానీ, చెల్లెలి ఇంటికి వెళ్లకుండా మార్గమధ్యలో ఉమ్మెడ శివారులోని బ్రిడ్జి పైనుంచి గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి అల్లుడు తాటిపల్లి సాయిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

మనస్తాపంతో ఒకరు..

నిజామాబాద్ రూరల్: మోపాల్ మండలంలోని మంచిప్ప తండాకు చెందిన గోవర్ధన్(38) మంచిప్ప పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గోవర్ధన్‌కు అతని భార్యకు తరచూ గొడవలు జరుగుతాయి. మద్యానికి బానిసయ్యాడని శనివారం ఇంట్లో గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన గోవర్ధన్ మంచిప్ప పెద్ద చెరువులో దూకడాన్ని మృతుడి కుమారుడు శ్రీనివాస్ చూసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

బైక్ చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని సతీశ్‌నగర్ కాలనీకి చెందిన షేక్ అజీం బైక్ చోరీకి గురైనట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి శనివారం తెలిపారు. వీక్లీ మార్కెట్‌లో ఓ దుకాణం ఎదుట పార్క్ చేసి పని ముగించుకొని వచ్చేలోపు బైక్ కనబడలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

వేల్పూర్: జాన్కంపేట్ గ్రామంలో శనివారం విద్యుత్ షాక్‌తో బండిరాము అనే రైతుకు చెందిన గేదె మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ శివారులో మేతకు వెళ్లిన గేదె(పోతు) ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తగలడంతో మరణించినట్లు పేర్కొన్నారు. గేదె విలువ రూ. 80 వేలు ఉంటుందని, బాధిత రైతుకు న్యాయం చేయాలని కోరారు.

బీబీపేటలో ఒకరి అదృశ్యం



శ్యాగ మల్లయ్య

బీబీపేట: మండల కేంద్రానికి చెందిన శ్యాగ మల్లయ్య గత నెల 31వ తేదీన అదృశ్యమైనట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పని నిమిత్తం ఇంటి నుంచి బయటికి వెళ్లిన మల్లయ్య ఇప్పటి వరకు తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో వరుసకు కుమారుడు అయిన పర్శ రాములు శనివారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎవరికైనా కనిపిస్తే సమాచారం అందించాలని ఎస్సై పేర్కొన్నారు.